UNIVERSAL LIBRARY
OU_206111
UNIVERSAL LIBRARY

OUP—901—26-3-70—5,000

**OSMANIA UNIVERSITY LIBRARY**

Call No. T340/V46A Accession No. T1425

Author

Title [illegible] 1933

This book should be returned on or before the date last marked below

రాజకీయ విజ్ఞాన ప్రచురములు. ౧

# ఆంగ్ల రాజ్యాంగము.

( బ్రిటీషు దీవుల రాజ్యాంగవిధానము. )

దిగవల్లి వేంకటశివరావు, బి. ఏ., బి. యల్.,
( దక్షిణాఫ్రికా, అధినివేశ స్వరాజ్యము
మొదలగు గ్రంథరచయిత. )

బెజవాడ : ఆంధ్రగ్రంథాలయ ముద్రాక్షరశాలయందు
కె. కోదండరామయ్యగారిచే ముద్రింపఁబడియె.
౧౯౩౩.

అన్నిహక్కులు గ్రంథకర్తవి.] [వెల ౧ అణా.

# ఆంగ్ల రాజ్యాంగము.

## ( బ్రిటిషుదీవుల రాజ్యాంగవిధానము )

బ్రిటిషుదీవులను పరిపాలించు రాజ్యాంగ విధానమున కధిపతి ఆంగ్లనృపాలుడు. రాజకుటుంబమునందలి జ్యేష్ఠుడే వంశపారంపర్యముగ రాజగుచుండును గనుక నీరాజ్యాంగము స్వరూపమున రాజరికమే. అయితే స్వభావమునుబట్టి రాజు నిరంకుశుడు కాడు. రాజ్యాంగధర్మబద్ధుడై, ఆ దేశప్రజాప్రతినిధుల శాసనసభయగు కామన్సుసభ వారియొక్కయు, శిష్టసభయగు ప్రభువులయొక్కయు, అభిమతము ననుసరించియే ప్రవర్తించును. మఱియు నిజముగ పేరునకుమాత్రమే రాజుగ నున్నాడుగాని, ఆప్రభుత్వాధికారము లెల్ల ప్రజాప్రతినిధులవే. ప్రజాభిప్రాయమున కతడు వ్యతిరేకముగ ప్రవర్తింపలేడు. బ్రిటిషురాజ్యాంగమునందలి ప్రభుత్వాధికారము లెల్ల రాజు, కామన్సుసభయు ప్రభువులసభయు కలిసిన "పార్లమెంటు" అనబడు రాజ్యాంగమునందు నెలకొనియున్నవి. అందువలన నీ రాజ్యాంగవిధానము స్వభావమును బట్టి ప్రజాప్రభుత్వమై యున్నది. బ్రిటిషు పార్లమెంటువారికి పరిపూర్ణప్రభుత కలదు. దీనికి పైన ప్రభుత్వాధికారములుగల వ్యక్తిగాని సంస్థగాని లేదు. ఈ పార్లమెంటులోని శాసనసభలవలన తీర్మానింపబడి రాజసమ్మతిని బడసిన శాసనములు ధర్మశాసనము లగుచున్నవి. గత రెండుశతాబ్దము

లలో ఆంగ్లరాజ్యాంగమునందలి ప్రభుత్వాధికారములు రాజునుండి ప్రజాప్రభుత్వముచేతిలోనికి వచ్చిన వని చెప్ప వచ్చును. పార్లమెంటుసభల శాసనములను ప్రత్యాఖ్య (వీటో) చేయు అధికారము రాజు తనయిచ్చవచ్చిన ప్రయోగించుటకు వీలులేకుండ పోయినది. మఱియు రెండుసభలలో ప్రజాప్రతినిధులసభయగు కామన్సుసభయే ప్రజాభిప్రాయమును ప్రతిబింబించుచు, నిజమగు ప్రభుతను చేజిక్కించుకొనినది. శాసననిర్మాణాధికారముగల రాజ్యాంగమునందలి ముఖ్యభాగమగు కామన్సుసభలో, దేశములోని ఎన్నికఫిర్కాలందలి ప్రజల విశ్వాసము సమ్మతములపైన నాధారపడియుండు ప్రతినిధిసభ్యులు నిండియున్నందున, ప్రజలస్వాతంత్ర్య స్వత్వములు స్థిరముగ స్థాపింపబడుటకు వీలు కలిగినది. అందువలన పార్లమెంటుయొక్క అధికారములు, ప్రభుత, అమితములు అనిర్ణీతము లైనను పార్లమెంటువారు స్పష్టమును, కృతమునగు ప్రజాభిప్రాయమునకు లొంగితీరవలసిన దే.

అందువలన రాజ్యాంగధర్మము చాలవరకు లిఖిత మూలముగాక ఆచారప్రమాణముపై నాధారపడి కాలానుసారముగ మార్పులు చేరికలు కలిగి క్రొత్తపరిస్థితుల కనుగుణముగ ఎప్పటి తటస్థించుచున్నవి. ఉదాహరణమునకు వ్రాతమూలమునగాక ఆచారమువలన నేర్పడిన "కాబినెట్టు" (మంత్రి మండలి)యొక్క రాజ్యాంగ ప్రాముఖ్యత చూడవచ్చును. పార్లమెంటు శాసనమునగాని, లిఖితమూలకమునగు ధర్మ

ముసగాని మంత్రిమండలి (కాబినెట్టు) అధికారములు గానరావు. కాని ఈ మంత్రిమండలియె ఆంగ్లరాజ్యాంగ కార్యనిర్వహణము చేయు ముఖ్యసంస్థ. పేరునకు ఆంగ్లరాజ్యాంగమున కార్యనిర్వహణము రాజునందు నెలకొల్పబడినట్లు ప్రతీతి కాని ఆచారమున శాసనసభలందలి సభ్యులలో నుండి పేర్కొనబడిన మంత్రిమండలియే కార్యనిర్వాహకవర్గముగ నున్నది.

ఆంగ్లనృపాలుడు--బ్రిటీషు రాజ్యాంగము:— సామాన్య ధర్మములవలన రాజ్యాంగ వ్యవహారాచార ధర్మములవలన రాజరికము వారసత్వముకలసంస్థ యనియు వారసత్వహక్కును పార్లమెంటువారు అప్పుడప్పుడు మార్చవచ్చుననియు, సంకుచితము చేయవచ్చుననియు నొక రాజ్యాంగసూత్రి మంగీకరింపబడియున్నది. ఈ హక్కులకు లోబడి పంచమజార్జి సార్వభౌముని "విండ్సర్" కుటుంబమున రాజరికము నెలకొల్పబడియున్నది. రాజు పెద్దకుమారునికి ౧౮ సంవత్సరములు వచ్చినంతనే సింహాసనయోగ్యత కలదు. ఈయనకు "వేల్సు యువరాజు" అని గౌరవనామము కలదు. రాజుయొక్క ప్రభుత్వాధికారము లెల్ల ధర్మపరిమాణబద్ధములై యున్నవి. భగవంతునివలన రాజ్యాధికారము లభించినదని వాటించుకోజులు పోయినవి. అయితే రాజుయొక్క విశేషాధికారములు (Prerogatives) అనుల్లంఘనీయములను సిద్ధాంతమును కలదు. వాని నెవ్వరు విమర్శింపరాదు. అతడే న్యాయసభకును ఉత్తరవాదికాడు. అందువలన రాజెట్టి అపచారమును చేయలేడను

సామెత వచ్చినది. అయితే రాజుయొక్క అధికారములపైన కొన్ని హద్దులుకలవు.

౧ రాజాజ్ఞలెల్ల దేశముయొక్క ధర్మమున కనుగుణముగా వ్యాఖ్యానము చేయబడును. దేశధర్మమునకు వ్యతిరేకముగ చేయుట కాయన తలంచి యుండడను సిద్ధాంతమును కూడ స్థాపించివైచిరి.

౨ రాజుచేసిన పనులకెల్ల రాజుయొక్క మంత్రులే ఉత్తరవాదులు. రాజాజ్ఞల నిర్వహించినందులకును, వారు ఉత్తరవాదులే. వారిని పార్లమెంటువారు విమర్శించి శిక్షింపవచ్చును. (Impeachment) రాజు చెప్పాటవలన చేసితిమని వారనినను లాభము లేదు.

3 పార్లమెంటువారును న్యాయస్థానములును కూడ రాజు చేసినపనులను స్వేచ్ఛగా చర్చించుటకు వీలు కలదు. పార్లమెంటువారికిని ప్రభువులసభలోని ప్రతిసభ్యునికిని ఆ కార్యములను గూర్చి రాజుతో చెప్పి అసమ్మతిని తెలుపుటకును అధికారము కలదు.

౪ ఆరాజుయొక్క కోపమునకు పాత్రులైన వ్యక్తులకు అక్రమనిర్బంధము కలిగినచో తమ నిర్బంధముయొక్క న్యాయాన్యాయములను విమర్శించి విడుదల చేయుడని హైకోర్టువారికి మనవి జేసికొను "హేబియస్ కార్పస్" హక్కుకలదు. తమ కక్రమముచేసినవారిపైన అభియోగముల దెచ్చి శిక్షింపజేయుటకు వీలు కలదు. పార్లమెంటునకు

ఫిర్యాదు (మనవి) చేసికొను హక్కు కలదు. మఱియు వాగ్రచనా ముద్రణ ప్రకటనస్వాతంత్ర్యము[illegible] పత్రికలయందు విమర్శింప వీలుకలదు.

రాజ్యాంగసూత్రమునుబట్టి యుద్ధమందు శాంతియందు కూడ రాజే రాష్ట్రాధిపతి. సార్వభౌముడును నృపాలుడే. ధర్మమునకు గౌరవమునకు రాజే మూలపురుషుడు. రాజే మతము యొక్క ప్రధానాచార్యుడు. పార్లమెంటు చిత్తుశాసనములను నిరాకరించు అధికార మాయనకు కలదు. అయితే అట్టి అధికారము ౧౭౦౮ నుండి ఎన్నడును చలాయింపలేదు. సర్వసేనానిగ సైన్యములను నౌకలను వాయువిమానములను నిర్మించు నధికార మాయనకు గలదుగాని దానికి వలసిన వ్యయమునకు సొమ్మునిచ్చు నధికారము పార్లమెంటుచేతిలో నున్నది. శాంతిభద్రతలను కాపాడుటకు ధర్మస్వరూపుడగు రాజే న్యాయాధిపతులను నియమించి న్యాయసభలను నిర్మింప గలడు. వాని ధర్మపరిపాలనాధికారము లెల్ల ఆయనవలననే కలుగుచున్నవి. గౌరవము ఉద్యోగము విశేషాధికారము (Prerogatives) లకు నాతడే మూలపురుషుడైనందున అన్ని బిరుదులు నొసగుట కాయన కధికారము కలదు. విదేశ వ్యవహారములందు రాష్ట్రముయొక్క ప్రతినిధిగ నెంచబడి ఆయనయే యుద్ధములను ప్రకటించి సంధులను చేయును. సామ్రాజ్యమునందలి పరిపాలకులకు ఆయా రాజ్యపరిపాలనను గూర్చిన నియమములుగల ప్రజ్ఞాపనపత్రము (Instrument of Instructions) రాజుపేరిటనే పంపబడుచుండును.

పార్లమెంటు:— ఆంగ్లపార్లమెంటులోని పరిభువులసభలో ఆంగ్లదేశములోని వంశపారంపర్యము కల పరిభువులెల్లరును సభ్యులే. నేడు ౭౦౧ మంది పరిభువులు కలరు. ఈసభకింతమందిసభ్యులకన్న హెచ్చుసభ్యు లుండరాదను నియమము లేదు. ౧౭౦౭ లో ౬౮౦ మంది పరిభువు లుండిరి. స్కాట్లాండు ఇంగ్లాండుతో కలుపబడినప్పుడు ౧౬ గురు పరిభువులు, పరిభుసభకు నియమింపబడిరి. పార్లమెంటు ఒకమారు కూడినప్పటికిని ౭ సంవత్సరములు సభ్యులుగ నుండును. ఐర్లాండు పరిభువులు, ౨౮ మందిని జీవితకాలమునకు సభ్యులుగ నుండుట కెన్నుకొందురు.

పార్లమెంటు స్థిరముగా సమావేశమగు సంస్థ కాదు. దానిని సమావేశము చేయుటకు విలయము (Dissolve) చేయుటకు రాజున కధికారముకలదు. కామన్సుసభకు ప్రతినిధులెన్నుకొనబడిన పిదప వారు మొట్టమొదట "స్పీకరు" అను అధ్యక్షు నెన్నుకొందురు. అంతట కామన్సుసభ్యులు రాజభక్తప్రమాణము చేయుదురు. అప్పుడు రాజుగారి ఉపన్యాసమును చదువుదురు. పరిభువులసభలో "లార్డు ఛాన్సలర్" అనుపదవిగల పరిభువు అధ్యక్షుడు. దేశవ్యయమునకు గావలసిన అన్ని ద్రవ్యసంబంధ చట్టములును (Money Bills) కామన్సుసభలోనే మొదట ప్రతిపాదింపబడవలయును. దానిని మార్చుటకు ప్రభువులసభకు వీలులేదు. అంగీకరించుటయో, నిరాకరించుటయో చేయవలయును. పరిభువుల అంగీకారములేకనే కొన్ని శాసనములను చేయుటకు కామన్సుసభవారి కధికార

మునిచ్చు రాజ్యాంగశాసనము ౧౯౧౧ లో చేయబడినది. అందువలన ఒక నెలలో ద్రవ్యసంబంధచట్టమును ప్రభువుల సభవా రామోదించనిచో కామన్సుసభవారు దానిని రాజున కంపి సమ్మతిపొంది శాసనముగా చేయవచ్చును. ఆచట్టము ప్రకారము ఏది ద్రవ్యసంబంధచట్టమో నిర్ణయించునది కామన్సుసభవారి అధ్యక్షుడే. పార్లమెంటును సమావేశము చేయునట్లు, రాజాజ్ఞచే దానిసమావేశమును తాత్కాలికముగ నిలుపుచేయవచ్చును. ఎన్నుకొనబడిన కామన్సుసభవారి జీవితకాలమగు ఐదువత్సరములు నిండినప్పుడు గాని, అంతకు ముందు రాజాజ్ఞవలనగాని, పార్లిమెంటువిలయము (Dissolve) చేయబడును. మంత్రిమండలి అధ్యక్షుడగు ప్రధానమంత్రి సలహాపైననే రాజు అట్టి ఆజ్ఞపైన చేవ్రాలు చేయునేగాని స్వతంత్రముగ నాజ్ఞాపించడు. ద్రవ్యసంబంధ ఆర్థికవ్యవహారము లందెల్ల కామన్సుసభవారికే అధికారముగలదు. ఒకసభ్యుని ఫిర్యాదువలనగాని, విజ్ఞాపనవలనగాని ఉపపాదనవలనగాని, కామన్సుసభలోనికి చర్చకు తీసికొనివచ్చుటకు వీలులేనివిషయమే లేదు. పార్లమెంటులోని ఉన్నతసభయగు ప్రభువుల సభయే ఇంగ్లాండుదేశమునందు, సామ్రాజ్యమందు, పరమోన్నతన్యాయస్థానము. సివిలు వ్యవహారధర్మమందు బ్రిటీషు దీవుల ఉన్నతన్యాయసభల తీర్పులపైన అప్పీళ్లను తీర్మానించు న్యాయసభ ప్రభువులసభయొక్క ఉపసంఘము (Lords of Appeal in Ordinary). దేశద్రోహములందు హత్యమున్నగు గొప్పనేరములందును అందుకొరకన్యాయశిక్ష

కలిగించినందుకును ప్రభువులను విచారించు ఉన్నత (క్రిమినలు) న్యాయసభ ప్రభువులసభయే. కామన్సుసభవారు చేయు రాజ్యాంగనేరారోపణములందు (Impeachment) విచారణచేయు ప్రాడ్వివాకులు ప్రభువులసభవారే.

ప్రజాప్రాతినిధ్యము:—కామన్సు సభలో ౧౮౩౨ కు పూర్వము ౬౫౮ సభ్యు లుండిరి. ఇందు ౫౧౩ ఇంగ్లాండు వేల్సులకు, ౧౦౦ ఐర్లాండునకు, ౪౫ స్కాట్లాండునకు, ప్రతినిధులు. అప్పుడు పనికిమాలిన గ్రామములకు బేచిరాకు గ్రామములకు ప్రతినిధిస్థానము లుండెను. అందువలన ధనము గలవారుగాని రాజుగారుగాని ధనము బలము నుపయోగించి తమ కనుకూలురగువారిని ఎన్నుకొనునట్లు చేయ వీలుండెను. కొన్ని పట్టణములుకూడ కొన్నికుటుంబముల చేతులలో నుండెను. ౫౦౦౦ పౌను లిచ్చిన నొకచిన్నప్రదేశమునుండి ఒకని నెన్నుకొనునట్లు చేయుటకు వీలుండెను. గ్రామములలో కొన్నిపౌనులవిలువగలిగిన ఆస్తిగాని, కొంతశిస్తుగాని ఇచ్చువారికిని, పట్టణములలో కొంత అద్దె యిచ్చువారికిని, ఎన్నిక హక్కు లొసగుచు క్రమమైన నియోజకవర్గమును నిర్మించుటకు ౧౮౩౨ లో నొక సంస్కరణచట్టము చేసిరి. ఆస్తి నియమమును ౧౮౬౭ లో తగ్గించిరి. ౧౮౮౪ లో మఱల కొన్ని సంస్కరణముల జేసినందున కామన్సు సభ్యుల సంఖ్య ౬౭౦ కి హెచ్చెను. ఐరోపా సంగ్రామానంతరము ప్రజల ఎన్నిక హక్కులను చాల సులభసాధ్యములుగ జేసిరి. ఆస్తి నిబంధనల నెల్ల తొలగించి ఎన్నిక ఫిర్యాదులలో

ఆరు నెలలు కాపురమున్న వారికిని, ఆరు నెలలు వ్యాపారము జేసికొనిన వారికిని, నియోజనాధికార మొసగబడెను. ౩౦సంవత్సరముల వయస్సు కలిగి పైన చెప్పబడిన నిబంధనలు పాటించు స్త్రీలకును, అట్టినియమములను పాటించు పురుషుల భార్యలకును గూడ నియోజనాధికార మొసగబడెను. ఇందువలన బ్రిటిషుదీవులలోని, నియోజకులసంఖ్య ౮ లక్షలనుండి ౨ కోట్లకు పెరిగెను. ౧౯౧౮ లో నొక శాసనమువలన స్త్రీలు పార్లమెంటుసభ్యులు కావచ్చునని స్థిరపడినది. ఎన్నికల ఫిర్కాలెల్ల సమానములుగ చేయబడెను. ౨౦౦౦౦ ప్రజల కొక ప్రతినిధి చొప్పున అభ్యర్థిస్థానముల నేర్పరచిరి. విశ్వవిద్యాలయములకును ప్రాతినిధ్యము కలదు. ఇట్లు కామన్సు సభ వారి సంఖ్య ౭౦౭ కు పెరిగెను. (ఇంగ్లాండు వేల్సులకు ౫౨౮, స్కాట్లాండు ౭౪, ఐర్లాండు ౧౦౫) ఇందువలన ఆంగ్లసామ్రాజ్యమున సార్వజనిక ప్రాతినిధ్యమునకు మార్గము లేర్పడినవి. ప్రజాప్రభుత్వము పరిపూర్ణస్వరూపము దాల్చినది. పార్లమెంటు సభ్యులకు సాలుకు ౪౦౦ పౌనులు వేతన మీయబడును. వారికి పార్లమెంటు చర్చలందు స్వేచ్ఛ, స్వాతంత్ర్యము కలదు. ఐరిషు ఫ్రీస్టేటు విడిపోయిన పిదప నిప్పుడు కామన్సు సభలో ౬౧౫ సభ్యులున్నారు.

కాబినెట్టు మంత్రి మండలి :—బ్రిటీషు రాజ్యాంగమున సర్వాధికారములు పార్లమెంటునకే కలవనియు ఆచరణమున పార్లమెంటుసభ్యులలో కొందరు కాబినెట్టు మంత్రి మండలిగ కార్యనిర్వహణమును జేయుదు రనియు గ్రహించి

తిను. ఈ కాబినెట్టుమంత్రిమండలి ప్రజాహితైకప్రభుత్వ మెట్లగునో చూడవలసియున్నది.

ఇంగ్లాండులోని ప్రజలలో అనాదినుండి యున్న లిబరల్సు కాన్సర్వేటివులు అను రెండుపక్షములును, కార్మికవాదులగు లేబరుపక్షమువారును రష్యాసిద్ధాంతములను వాంఛించు కమ్యూనిస్టులును కలరు. సాధారణముగా మొదటి మూడు పక్షములే ప్రాముఖ్యము చెందినవి. వారిలో ఏ పక్షము వారి ప్రతినిధులు కామన్సుసభకు హెచ్చుగ నెన్నికొనబడుదురో ఆ పక్షమువారినాయకుని నృపాలు డాహ్వానించి మంత్రివర్గము నేర్పరచుమని కోరును. ఆ నాయకుడే ప్రధానామాత్యుడగును. అంతట నతడు రాజకార్యములను పరిపాలించుటకు వలసినవారిని తన సహచరులను, అనుకూలురను చేర్చుకొనును. కొందరిను ప్రభువులసభనుండికూడ చేర్చుకొనును. వీరిలో స్వదేశవ్యవహారములు, విదేశవ్యవహారములు, యుద్ధవ్యవహారములు, వలసరాజ్యములవ్యవహారములు, భరతఖండ వ్యవహారములు, వాయువిమాన వ్యవస్థ, స్కాట్లాండు వ్యవహారములును చూచుమంత్రులను రాజ్యాంగమంత్రి లేక కార్యదర్శి (Secretaries of State) అని పిలుతురు. ఈ ఏడుగురుమంత్రులును, నౌకావ్యవస్థాధ్యక్షుడు (First Lord of Admirality) కోశాధ్యక్షమంత్రి (Chanceller of Exchequer) లార్డు ప్రెసిడెంట్ ఆఫ్ ది కవున్సిల్ అను అధికారియు, వర్తకబోర్డు అధ్యక్షుడు, విద్య ఆరోగ్య పరిశ్రమశాఖమున్నగువాని పరిపాలనశాఖాధ్యక్షులు కొందరును, కాబి

నెట్టు కార్యనిర్వాహకమంత్రిమండలిలో సభ్యులుగ నుందురు. ఇప్పుడు కాబినెట్టులో ౨౧ మంది యున్నారు. దీనిలో చేరని మంత్రివర్గమువారు ముప్పదియైదుమందికి పైబడికలరు. కాబినెట్టు మంత్రిమండలి సభకు ప్రధానమంత్రియె అధ్యక్షుడు. వారు రహస్యకార్యాలోచనము చేయుదురు. వారిచర్చలు తీర్మానములు ప్రకటింపబడవు. ప్రధానమంత్రి పరిపాలన శాఖలన్నిటిపైన అధికారము గలిగి వ్యవహరించును. తానేదైన శాఖను ప్రత్యేకముగ చూచిన చూడవచ్చును; లేకున్నలేదు. కాబినెట్టువారి అభిప్రాయములను రాజుగారి కతడే తెలియబరచును. అట్లే మంత్రిమండలియొక్క అభిప్రాయములను అతడు స్వయముగ గాని అతని యిష్టప్రకార మింకొకరుగాని, పార్లమెంటువారికి తెలుపవలయును. మంత్రిమండలిలో ప్రధానమంత్రికిని తక్కినమంత్రులకును సరిపడనిచో అతడైన రాజీనామా నీయవలయును, లేదా ఆ రెండవయతడైన రాజీనామా నీయవలయును. రాజీనామా నిచ్చిన మంత్రి కామన్సుసభలో తన యభిప్రాయములను వెల్లడించి ప్రధానామాత్యుని కాబినెట్టుయొక్క సలహాలను చిత్తుచట్టములను ఓడింపజేయగలిగినచో నాప్రధానమంత్రియు తక్కిన మంత్రిమండలియు రాజీనామా నిచ్చి పదవులువదలుకొనవలసియుండును. ఏలనన కామన్సుసభలో అధికపక్షమువారి సహాయము విశ్వాసములేని మంత్రివర్గము కార్యనిర్వాహణ సేయరాదను రాజ్యాంగసూత్రము ఆచారమువలన ప్రమాణధర్మమైనది. కామన్సుసభవారికి కార్యనిర్వాహకవర్గమువారు

తాబేదారులుగ నుండవలెను. కాబినెట్టుమంత్రిమండలివా రెల్లరు సమష్టిగ బాధ్యతనవహించవలెను. అందువలన వారి యందైకమత్యముండితీరవలెను. ఎవరి చిత్తము వచ్చినట్లు వారు వ్యవహరింపవీలులేదు. కామన్సుసభ వారివిశ్వాసము గోల్పోయిన కాబినెట్టు మంత్రిమండలి, తమ యభిప్రాయమే ప్రజాసమ్మతము బడయు ననియు, ఈ కామన్సుసభ విలయమైనచో తమ కనుకూలపక్షమువారే క్రొత్త ప్రతినిధులుగ వత్తురనియు తాము వారి విశ్వాసము బడయగలుగుదుమనియు ధైర్యమున్నచో ప్రధానమంత్రి రాజుదగ్గరకుబోయి పార్లమెంటును విలయము ( Dissolve ) చేయుమని కోరును. అంతట మరల కామన్సుసభకు ఎన్నికలు జరుగును. అప్పుడు ప్రాతప్రభుత్వమంత్రిమండలికే క్రొత్తసభలో గూడ అధిక సంఖ్యాబలము కలిగినచో వారినే మరల మంత్రివర్గముగా నియమించుటగాని క్రొత్తకాబినెట్టు మంత్రిమండలి నేర్పాటుచేయుమని క్రొత్తపక్షనాయకుని రాజు ఆహ్వానించుట గాని జరుగును. ఇట్లు దేశములోని ప్రజాభిప్రాయము, నియోజకవర్గమువారివలన కామన్సుసభలో ప్రవేశించి బ్రిటీషు కాబినెట్టు ప్రభుత్వమును నడుపుచున్నది. పార్లమెంటువారి చట్టములు ప్రచురింపబడును. ప్రజలకు వ్యక్తిస్వాతంత్ర్యము వాక్స్వాతంత్ర్యము, సమావేశస్వాతంత్ర్యము, ఉన్నందున నిర్భయముగ ప్రభుత్వపరిపాలనమును విమర్శింతురు. అందువలన ప్రజాప్రతినిధులు ప్రజాభిప్రాయముప్రకారము నడచుకొందురు. అట్లు చేయనిచో క్రొత్తఎన్నికలందాపక్షమువా

కోడిపోవుదురు. అందువలననే బ్రిటీషుపార్లమెంటుప్రభుత్వము ప్రజాప్రభుత్వమైనది.

నియోజకవర్గము-పార్లమెంటుసభ్యులు:– ప్రభుత్వము ప్రజాప్రతినిధులకు బాధ్యతకలిగియెట్లుప్రవర్తించునో అట్లే ప్రజాప్రతినిధులును జనసామాన్యమునకు బాధ్యతకలిగి ప్రవర్తించవలసియుందురు. ఇది ఆచరణమునందు చిత్రముగా సంభవించుచున్నది. పార్లమెంటులో నెట్లు కాన్సర్వేటివు, లిబరలు, లేబరుపక్షములు కలవో దేశములోని నియోజకవర్గములందును అట్లే ఆయా రాజకీయపక్షములును చిరకాలమునుండిఏర్పడియున్నవి. ప్రతిపట్టణమునను పల్లెయందునుగూడ నీ వివిధరాజరాజకీయపక్షములకు జెందిన సంఘములు కలవు. వీనికి పొలిటికల్ క్లబ్బులని పేరు. దేశములోని జనులీ సంఘములం దేదో యొకదానియందు సభ్యులుగా నుండితీరుదురు. అచ్చటి ఆచారమునుబట్టి ఈ సంఘములో సభ్యుడు కానిది పార్లమెంటుకుగాని ఇతరస్థానికసంస్థలకుగాని అభ్యర్థిగా నిలుచుటకే వీలుండదు. అట్టిసంఘములద్వారా ప్రతినిధిగా నెన్నికైనవాడా సంస్థలందు వీనియభిప్రాయానుసారముగా ప్రవర్తించును. వీని యభిప్రాయములనే వెల్లడించును. వీని యిష్టానుసారముగనే వోటు నిచ్చును. ఇందుకు విరుద్ధముగా ప్రవర్తించెనేని వెంటనే తన ఎన్నికఫిర్యాదులోని రాజకీయసంఘము వారి విశ్వాసమును గోల్పోవును. అంతట నతడా సంఘసభ్యత్వమునకును దానితోపాటు పార్లమెంటుసభ్యత్వమునకును నీళ్లు వదలుకొని రాజీనామా నీయవలసినదే. ఇట్లు ప్రజాభి

ప్రాయమునకు పార్లమెంటుప్రతినిధు లెల్లప్పుడును కట్టుపడి
యుందురు.

సామ్రాజ్యపరిపాలనము - పార్లమెంటు:— బ్రిటీషు
రాజ్యాంగవిధానమును బట్టి ఆంగ్లప్రభుత్వమే సామ్రాజ్య
ప్రభుత్వమైనది. బ్రిటీషుపార్లమెంటుకు గల ప్రభుత సార్వ
భౌమత్వ ప్రభుతగ మారినది. ప్రభుత యనగా రాష్ట్రప్రజ
లెల్లరికి సను సంపూర్ణపరిపాలనాధికారము కలిగియుండు అంత
రంగికస్వాతంత్ర్యము, పరరాష్ట్రములకు లోబడని బాహ్య
స్వాతంత్ర్యము. ఎట్టి శాసనములను గాని నిర్మించుటకు
నిర్మూలించుటకు పార్లమెంటువారికే సర్వాధికారములు గల
వనియు పార్లమెంటువారి శాసనములను రద్దుచేయుటకు
గాని వృథలు చేయుటకు గాని ఏ వ్యక్తికిని ఏ సంస్థకును నధి
కారము లేదనియు కూడ గ్రహించితిమి. పార్లమెంటువారికే
బ్రిటీషునృపాలుని మకుటముక్రింద నున్న రాజ్యభాగములం
దెల్ల సార్వభౌమప్రభుత కల దను రాజ్యాంగధర్మము స్థిర
పడుటయు చూచితిమి. అయితే పార్లమెంటువారు తమ
ప్రభుతను ఇంగ్లాండు రాజ్యమున చలాయించినట్లు సామ్రాజ్య
భాగములందును చలాయించుచున్నారా యనునది వేఱు
సంగతి. పూర్వము చలాయించిరి; నేడు తమ అధికారములు
పూర్ణముగ గట్టిగ చలాయించినను లేకపోయినను ఆ యధి
కారము తమకు కలదని ఇప్పటికిని వారు వాదించుచున్నారు.
ఈ రాజ్యాంగసూత్రమును బ్రిటీషుసామ్రాజ్యమందు ధర్మ
పరిపాలనము చేయుచు వచ్చిన ప్రాడ్వివాకపరంపరయు అంగి

కరించి తమ తీర్పులందు ప్రమాణధర్మముగ జేసిరి. సామ్రాజ్యములోని దేశములందలి ఉన్నతన్యాయస్థానముల పైన అప్పీళ్ళను తీర్మానించు నధికారము గల బ్రిటీషుప్రీవీకవున్సిలువారును దీనిని సిద్ధాంతీకరించియున్నారు. సామ్రాజ్యపార్లిమెంటువారి సార్వభౌమప్రభుతను పురస్కరించుకొనిన ప్రభుత్వాధికారములు బ్రిటీషుసామ్రాజ్యము నందలి అన్ని భాగములపైన నొకేరీతిగ లేవు. అవి ఆయా దేశములరాజ్యాంగస్వాతంత్ర్యములను బట్టి హెచ్చుగను స్వల్పముగను నున్నవి.

ప్రీవీకవున్సిలుసభ:—ప్రీవీకవున్సిలు ఆంగ్లరాజసభ. రాజునకు నిరంకుశాధికారము లుండిన కాలమున దీనికిని ఆయన చిత్తానుసారముగ నొసగబడిన రాజకార్యాలోచన ధర్మపరిపాలనాధికారము లుండెను. రాజు ధర్మబద్ధుడైన పిదప దీని అధికారములును పోయినవి. అయితే ఇదిస్వరూపముతో నిలిచి కొన్ని పనులకు తోడ్పడుచున్నది. ప్రీవీకవున్సిలులో నిందరుసభ్యు లుండవలయునను నియమము లేదు. ఇంతమంది సమావేశము కావలయునను "పూరకసంఖ్య" నియమము (Quorum) ను లేదు. పరదేశీయుడు కానట్టి బ్రిటీషుపౌరు నెవ్వరినైనను ప్రీవీకవున్సిలుసభ్యుడుగ రాజు చేయవచ్చును. మన రైట్ ఆనరిబుల్ శ్రీనివాస శాస్త్రిగారిట్లు చేయబడిరి. తన శక్తివంచనలేక రాజునకు మంచి సలహా నొసగెదనని ఆసభ్యుడు ప్రమాణము చేయవలయును. ఆలోచనలు సలహాలు రహస్యముగ నుంచుటకు

బాధ్యుడు, రాజు ఈసభ్యులను తనచిత్తముచొప్పున పదభ్రష్టులను చేయవచ్చును. ఆచరణమున ప్రీవీకవున్సిలులో ౩౫౦ మంది సభ్యు లుండురు. ప్రాతకాబినెట్టు మంత్రిమండలిలోని మంత్రులు, ప్రస్తుతమంత్రులు, ఆర్చిబిషప్పు లనబడు మతాచార్యు లిరువురు, భూతపూర్వ ఉన్నతన్యాయాధిపతులు (Ex-Judges) ప్రస్తుతన్యాయాధిపతులు, సైనికరాజకీయ విషయములలోను ఇతరవిధములుగను ప్రాముఖ్యత గడించిన పురుషులును, సభ్యులుగ నియమింపబడుదురు. రాజ్యాంగ ఉద్యోగధర్మములనుబట్టి నేడు ప్రతికాబినెట్టుమంత్రియు ప్రీవీకవున్సిలు సమావేశమునకు పిలువబడును. అట్లే ఆంగ్ల ప్రధానన్యాయాధిపతి (Lord Chief Justice) యు పిలువబడును. న్యాయాధిపతులు, ఆర్చిబిషప్పులు, లండనుబిషప్పులు సమావేశమునకు పిలువబడుదురు. వీరిని దుష్ప్రవర్తనకు తప్ప, పదభ్రష్టులుగ చేయరాదు. ఈ సభలో వివిధరాజకీయపక్షములవా రుండుటవలన ప్రీవీకవున్సిలు పూర్తిగ సమావేశమైనచో ఏ పనియు జరుగదు. అయితే రాజు సభ్యులందరను పిలువవలె నను నియమము లేనందునను, రాజ్యాంగఆచారమునుబట్టి కొద్దిమందినే పిలువవలె నను నియమ మున్నందునను, సాధారణముగ పూర్తిసభ కూడదు. నేడు రాజునకు మిగిలినరాజ్యాంగవిశిష్టాధికారములు (Prerogatives) ఈ సభాయుతుడగు రాజు చేసినట్లే ఎంచబడుచున్నవి. నిజముగ ధర్మబద్ధుడగు రాజేదో యొకరి యాలోచన లేనిది ఎట్టిపనియును జరుపరాదు గదా!

అందువలన రాజ్యాంగశాఖలమంత్రులలోను ముఖ్యాధికారుల లోను కొందరిసలహా పుచ్చుకొనకుండా ఏ పనియుచేయడు. అనేకవ్యవహారములు పార్లమెంటుశాసనములవలన గాక రాజాజ్ఞలవలననే జరుగు నియమము లాంగ్లరాజ్యాంగవిధానమున ఆచారమైనది. సభాయుతుడగు రాజు (King in Council) యొక్క శాసనములవలన నిర్ణయించిన అధికారములును, రాజ్యాంగమంత్రులకు శాసనములవలన నియ్యబడిన అధికారములును, రాజు ఆచరించుట యెట్లు? ప్రీవీకవున్సిలు లోని కొందరుసభ్యులు సమావేశమై "ప్రీవీకవున్సిలు సభాయుతుడగు రాజాజ్ఞ" అను నొక ఆజ్ఞాపత్రము నంపుదురు. ఈ ఆజ్ఞలెల్ల ఆ యావ్యవహారములకు సంబంధించిన రాజ్యాంగమంత్రియే తన కార్యస్థానమున సిద్ధముచేయును. అయితే ఆచారమునకు వ్యతిరేకముగ మంత్రియే ప్రకటించినచో వానికి గౌరవ ముండదు. ఉదాహరణమునకు అధినివేశములలోని గవర్నరుజనరలులకు పంపు (Instrument of Instructions.) వ్యవహారనిర్వాహ ప్రజ్ఞాపనపత్ర) ము వలసరాజ్యాంగమంత్రిచే తయారుచేయబడి. సభాయుతు డగురాజముద్రిక దాల్చి రాజాజ్ఞ యగును. పూర్వము ప్రీవీకవున్సిలు కుండిన ధర్మపరిపాలనాధికారములలో చాలవరకు పోయినను ఇది దేశాంతరరాజ్యములందలి న్యాయసభలపైన పరమోన్నత అప్పీలుకోర్టుగ నిలిచియున్నది. మొదట ఆట్టిరాజ్యములు బహు స్వల్పములుగ నుండి, ప్రపంచమున నాలుగవ వంతుభూమి, ప్రజలు, గల విశాలసామ్రాజ్య మయ్యెను.

౧౮౩౩ వరకును ప్రీవీకవున్సిలుసభవారిలో పూర్వము గొప్ప న్యాయాధిపతులుగ పనిచేసినవారే వలసరాజ్యముల న్యాయసభల తీర్పులపైన వచ్చిన అభియోగములను పునర్విమర్శ చేయుచుండిరి. ఆసంవత్సరమున చేయబడిన శాసనమువలన ప్రీవీకవున్సిలుసభలో నొక ఉపసంఘమును "జూడిషియల్ కమిటీ" అను పేరున స్థాపించి అందు ఇదివరకు ఉన్నతన్యాయాధిపతులుగ నుండినవారినిగాని, ప్రస్తుతమున్నవారినిగాని సభ్యులుగ నియమించుటకును, నాటి అయభియోగములను పునర్విమర్శ చేయునట్లును, శాసించిరి. ౧౮౭౧ లో వేతనము లిచ్చి నలుగురు సభ్యుల నీ ఉపసంఘమున ప్రాడ్వివాకులుగ నుండుటకు నియమించిరి. వారితో లార్డ్‌ఛాన్సలరును కలిసి ఆ ప్రీవీకవున్సిలు కోర్టువారిపను లెల్ల చూచుచుందురు. ఈ నలుగురును నేరువారు ప్రభువులసభ వారి సర్వోన్నత న్యాయసభయందును ప్రాడ్వివాకసభ్యులు (Lords of Appeal in Ordinary) గ నుండుటవలన ప్రభువులసభవారి బ్రిటీషుదేశపు సర్వోన్నత న్యాయసభయందును, వలసరాజ్యములపైని పరమోన్నత ధర్మపరిపాలనసభ యగు ప్రీవీకవున్సిలు సభయందును, ఒకే సభ్యులగుట తటస్థించినది. ఈ న్యాయసభవారు వలసరాజ్యముల తీర్పులను ఖాయపరచుచుగాని త్రిప్పివేయుచుగాని చేసినతీర్మానము రాజున కిచ్చు సలహారూపమును దాల్చును. అంతట ఆ తీర్పు ప్రకారము ప్రీవీకవున్సిలు సభాయుతుడగు రాజు ఒకఆజ్ఞను ప్రకటించును.

న్యాయపరిపాలనము:— ఇంగ్లాండులోని ధర్మశాస్త్రమును పరిపాలించువారిందుకొరకు నియమింపబడు న్యాయాధిపతులే. లండనుపట్టణమున నొక హైకోర్టు కలదు. ఈ ఉన్నత న్యాయస్థాన మచ్చటి సివిలుదావాలను విచారించును. దీని తీర్పులపైన రెండుఅప్పీలుకోర్టులు కలవు. అన్ని కోర్టులతీర్పులపైన పరమోన్నతన్యాయస్థానమగు ప్రభువులసభ అప్పీళ్లను విమర్శించును. కింగ్సుబెంచి డివిజను జడ్జీలనబడు న్యాయాధిపతులు సంచారముచేసి కొన్నిచోటులందు గలన్యాయస్థానములలో దేశములోని ఇతరప్రాంతములందలి సివిలుదావాలను విచారింతురు ఇతర దావాలను విచారించుటకు వివిధ కోర్టులు కలవు. క్రిమినలు అభియోగములలో హైకోర్టు న్యాయాధిపతులే సంచారము చేయుచు కొన్నిచోటుల పరివేష్టించి, బహిరంగన్యాయసభలయందు ముద్దాయిలపైనగల నేరములను విచారణము సలుపుదురు. ఈ సంచార సమావేశములకే 'అస్సైజస్' అని పేరు. ఇదిగాక చిన్నవ్యవహారములు వివిధ దండవిధాయి న్యాయసభలు విచారించును. న్యాయసభలందు న్యాయాధిపతి యధ్యక్షత వహించును. ఆయనకు న్యాయవిచారణమున సహాయము చేయుటకొరకు పండ్రెండుగురు "ప్రమాణపురుషులు" కూడ ఆహ్వానింపబడుదురు. వీరిని జూరీ సభ్యులందురు. పెద్ద నేరములెల్ల న్యాయాధిపతులే విచారింపవలయును. చిన్ననేరములను విచారించునది స్థానిక గౌరవ దండవిధాయి లేక మేజస్ట్రేటు. ఒకనేరము తాను విచా

రింపతగినదా లేక న్యాయాధిపతి విచారింపతగినదా యని తీర్మానించు నధికారియు మేజస్ట్రేటే.

ఆంగ్లధర్మపరిపాలనమున న్యాయవిచారణపద్ధతి లేక వ్యవహారధర్మము చాల ప్రాముఖ్యత వహించినది. దీనికి కారణము లేకపోలేదు. ముద్దాయికి న్యాయము జరుగవలె నన్నచో నిష్పక్షపాతమగు విచారణ జరుగుట యావశ్యకము. ఇందుకొరకు కొన్ని ధర్మసూత్రము లాచారమువలన ధర్మ ప్రమాణములైనవి. ముద్దాయిపైన ఆరోపింపబడిన నేరము ఋజువు చేయబడువరకు నతడు నిర్దోషియని యెంచవలె నను ప్రధానసూత్ర మొకటి సర్వజనసమ్మతము నడచినది. ఆంగ్లదేశమున నెవ్వరిని అక్రమముగా నిర్బంధింపరాదను నియమముకూడ కలదు. నేరమునుగూర్చిన నిజానిజములు న్యాయసభయందు విచారించి తీరవలయు నను నియమమును గలదు మరియు విచారణ జరుపునప్పుడు నేరారోపణము చేయబడిన ముద్దాయికి, తాను నేరము చేయలేదని స్థిరపరచుకొనుటకు అన్నివిధములగు అవకాశములు నీయవలెను. పోలీసువారు ఎవరిపైన నైన ఒకజిల్లాలో నేరస్థాపనము చేయునప్పుడు, ఆ జిల్లాలోని నియోజకవర్గము వారిలో లాట్లు వేసి ఎన్నుకొనబడిన "గ్రాండ్ జూరీ" అనబడు సభ్యులయెదుట పెట్టవలెను. మేజస్ట్రేటువలెనే వారును ముద్దాయిపైన ఆరోపింపబడిన నేరమునుగూర్చిన కారణములు విని ఆ యభియోగము విచారణయోగ్యమగునా కాదా యని విమర్శించి తీర్మానించుదురు. వారు విమర్శయోగ్యమనిననే ఆ ముద్దా

యిని అచ్చటికి దగ్గరగనుండు సంచార న్యాయసభయొక్క మఱుసటి సమావేశము నెదుట హాజరు పెట్టుదురు. లేనిచో ఆ ముద్దాయిని వదలిపెట్టవలసిన దే.

జూరీవిచారణ:— చాలస్వల్పపు వ్యవహారములందు తప్ప అన్నివిచారణములందు న్యాయసభలో న్యాయాధిపతికి సహాయము చెయుటకొఱకు ఆహ్వానింపబడు ౧౨ గురు సామాన్యపురుషులకు జూరీసభ్యు లని పేరు. సంచారన్యాయసభ సమావేశమున వారును పరివేష్టించి న్యాయవిచారణ చేయుదురు. ముద్దాయిపైన గల అభియోగమును రుజువుచేయు భారము ఫిర్యాదీది. ఫిర్యాదీ తెచ్చిన సాక్ష్యమెల్ల బహిరంగ సభలో విచారింపబడును. మనదేశమునందువలెనే న్యాయవాదులుగాని ముద్దాయిగాని అడ్డుప్రశ్నలను వేయుదురు. తరువాత సాక్ష్యసాధనములనుగూర్చియు, ఆ నేరమునకు వర్తించు ధర్మశాస్త్రత్వమును గూర్చియు, నిష్పక్షపాతముగు రీతిని న్యాయాధిపతి జూరీసభ్యులకు తెలియునట్లు విశదపరచును. అటుపిమ్మట నీ జూరీసభ్యులు ఒక గదిలోనికిపోయి తమలో తాము ముచ్చటించుకొందురు. కొంతసేపటికి మఱల న్యాయసభలోనికి వత్తురు. అప్పుడు న్యాయాధిపతి ముద్దాయి దోషియా నిర్దోషియా అని వారి నడుగును. అంతట వారేకగ్రీవముగ నిర్దోషి యనినచో వెంటనే విడుదలచేయును. దోషి యనినచో వానికి న్యాయశాస్త్రప్రకార మెంతశిక్ష విధింపతగునో యోజించి అట్టిశిక్షను విధించును.

శిక్షితుడు అప్పీలుచేసికొనుటకు అవకాశము కోరినచో అట్టి అవకాశము కలదు. అంతట నాయభియోగము ఉన్నత న్యాయ సభ (ఉన్నత న్యాయస్థాన అప్పీలుశాఖ) వారివలన పునర్విమర్శ చేయబడి నిర్దోషియని ఆకోర్టువారెంచినచో నతనిని విడుదలచేయవచ్చును. పెద్దసివిలుదావాలలో ఉన్నతన్యాయసభవారి అప్పీలుశాఖ తీర్పుపైన ఇంగ్లాండులోని ప్రభువులసభవారే పునర్విమర్శనచేయు పరమోన్నతన్యాయసభగా వర్తింతురు. ఆచరణమున అందరు ప్రభువులుగాక ప్రభువులసభలోని కొందరు సభ్యులొక ఉన్నత న్యాయసమితిసభగా తీర్మానింతురు. యువక అపరాధులు (Youthful Offenders) ఒక ప్రత్యేకన్యాయసభయందు విచారింపబడి, దోషులుగ పరిగణింపబడినచో సంస్కారకారాగారముల కంపబడుదురు.

అభియోగవిచారణమున జూరీసభ్యులకు గల అధికారములవలన న్యాయపరిపాలన నిష్పక్షపాతముగను, న్యాయ్యముగను నున్నది. ఒక న్యాయాధిపతి పొరపాటుపడవచ్చును. ఇష్టానిష్టము లుండవచ్చును. రాజకీయాభిప్రాయములవలన పక్షపాతమునకును ప్రభుభక్తిపరాయణత్వమువలన అధికారపక్షము వహించు పద్ధతికిని లోబడవచ్చును. అందు ముఖ్యముగ ప్రభుత్వమువారికి సంబంధించిన రాజకీయనేరములందు న్యాయాధిపతులకు స్వాతంత్ర్యము, స్వేచ్ఛ, తక్కువ కావచ్చును. కార్యనిర్వాహక శాఖయు న్యాయపరిపాలనాశాఖయు ఒకే ఉద్యోగులందు గల భరతఖండమున నీ లోపములు బాగుగ

కనబడుచున్నవి. జూరీసభ్యు లన్ననో పరమార్థచింత ధర్మ వివేచనగల సామాన్యపౌరులు. వా రొకరి నౌకరులు కారు. ప్రభుత్వమువారి తాబేదారులును కారు. అందువలన దోషనిర్ణయమున వారియభిప్రాయము పక్షపాతరహితమై, నిర్భయత గలిగి, స్వబుద్ధికి సామాన్యబుద్ధికి న్యాయముగను ధర్మముగను తోచినదే అయియుండును. ధర్మపరిపాలనము నిష్పక్షపాతముగ నుండుటయే గాక జనసామాన్యమునకు సులభసాధ్యముగ నుండవలయును. మరియు ప్రభుత్వమువారి నిరంకుశాధికారములకు లోబడనిదిగను, ప్రజలు శరణువేడినంతటనే ప్రభుత్వమునుండి సైతము వారిని రక్షించి న్యాయము గయచేయునదిగను నుండవలయును. న్యాయపరిపాలనమునకు స్వేచ్ఛాస్వాతంత్ర్యము లుండనిచో నది సిద్ధింపనేరదు.

ఇంగ్లాండులో రాజ్యాంగధర్మపరిణామమునం దిది సిద్ధించినది. ఇంగ్లాండులో మొదట రాజులు నిరంకుశముగ పరిపాలించినదినములలో న్యాయాధిపతుల జీతబత్తెములకు వారి నాశ్రయింపవలసి వచ్చుచుండెను. మఱియు న్యాయాధిపతుల ననేకవిధములుగ బెదరించి ధర్మభంగము గావించుటకవకాశము లుండెను. ఆంగ్లపార్లమెంటుయొక్క ప్రభుత వర్ధిల్లి ప్రజాప్రభుత్వము పరిపూర్ణత జెందుకొలది ప్రజాస్వాతంత్ర్యములను గాపాడుముఖ్యసాధనములు న్యాయసభలని గ్రహించి వానికి సంపూర్ణస్వాతంత్ర్యము స్వేచ్ఛ అధికారబలము లొసగబడినవి. కొన్ని శాసనములందు అవి స్పష్టీకరింపబడి

నవి. నిష్పక్షపాత మగు జూరీవిధానము స్థిరపరుపబడినది. ౧౭౦౧ లో నొకశాసనమువలన సత్ప్రవర్తన కలిగిన న్యాయాధిపతులు యావజ్జీవము జడ్జీలుగ నుండవచ్చుననియు, వారి జీతములు నిర్ణీతములై క్రమముగ నొసగబడవలెననియు, పార్లమెంటు ఉభయసభల వారు నేకగ్రీవముగ కోరిననే బ్రిటీషు నృపాలుడు వారిని తీసివేయవచ్చుననియు, శాసింపబడినది. అందువలన నేటి న్యాయస్థానములు స్వతంత్రనిర్ణరోధధర్మసంస్థాపనాధికారములను కలిగి స్వేచ్ఛగ న్యాయపరిపాలన చేయగలుగుచున్నవి. ప్రజాభిప్రాయమునకు, ప్రభుతకు, తప్ప వారు భయపడవలసిన పనిలేదు. రాజేదైన తప్పుపని చేసినచో రాజును విచారించ వీలులేకపోయినను ఆయన మంత్రులను విచారించి శిక్షింపవచ్చును. రాజుగూడ ధర్మబద్ధుడైనందున ప్రజాప్రభుత్వము పరిపూర్ణత జెందినది.

ఆంగ్లప్రజల స్వాతంత్ర్యములు:—ఆంగ్ల రాజ్యాంగ ధర్మములనలెనే, ఆంగ్లప్రజల సార్వజనికస్వత్వములును, లిఖిత రూపము దాల్పకయే ఆచార ధర్మ ప్రమాణము పొంది యున్నవి. ఆంగ్లప్రజలస్వాతంత్ర్యములు వారి రాజ్యాంగము నందే యిమిడియున్నవి. వారి రాజకీయ జీవనమున ప్రాధాన్యత నహించిన ఎన్నిక హక్కు, వారి స్వేచ్ఛాస్వాతంత్ర్యములను గాపాడు ముఖ్యసాధనముగా నున్నది. ప్రధాన ప్రభుత్వసంస్థ యగు పార్లమెంటునకు, ప్రతినిధుల నెన్నుకొను నియోజనాధికారము, సామాన్యప్రజల కున్నందున, సామాన్య వ్యక్తులయొక్క స్వాతంత్ర్యము రాజ్యాంగమునందు స్థిరీ

భూతమైనది. వ్యక్తిస్వాతంత్ర్యమును కూర్చినవాక్కుల విష యమై సామాన్యజనులు పలుకుబడి కలిగియున్నారు.

ఆంగ్లధర్మపరిపాలనము, సామాన్యధర్మమును, వ్యక్తి స్వాతంత్ర్యమును కాపాడుటకు తోడ్పడుచున్నవి. న్యాయాధి పతులు ప్రభుత్వమునకు తాబేదారులుగాక స్వతంత్రులై యున్నందున పరిపాలకవర్గమువారి నిరంకుశచర్యలను నిర్భ యముగా విమర్శించి విచారణాలందు తీర్పులు చెప్పగలుగు చున్నారు. ప్రభుత్వమువలన ప్రజల కేయన్యాయములును జరుగకుండగా న్యాయస్థానములు కనిపెట్టి చూచుచుండుటకు నవకాశము కలిగినది. మఱియు క్రిమినలువిచారణాలందు ముద్దాయి నేరము చేసెనో లేదో అని నిర్ణయించువారు న్యాయాధిపతిగాక ఆయనతో న్యాయసభయందు పరివేష్టించు పన్నెండుగురు సామాన్య పెద్దమనుష్యులై యున్నారు. ఈజూర్‌సభ్యులను జిల్లాలోని ప్రజాసభలు నియమించుచుం డును. వీరు దోషియని నిర్ణయించనిదే న్యాయాధిపతి ముద్దాయికి శిక్షవిధింపరాదు. అందువలన నేరముచేసినవాడు సామాన్యుడైనను, ప్రభుత్వాధికారియైనను అతని చర్యలు విమర్శించువారు సామాన్యపౌరులే యైయున్నందున నిష్పక్ష పాతముగ దోషనిర్ణయము జరుగుటకు వీలుకలుగుచున్నది.

'వారంటు' అనగా కోర్టువారియొక్కగాని ఇతరఅధి కారి యొక్కగాని అధికారపత్రము లేనిది, ఎవ్వరిని నిర్బం ధింపరాదనుసూత్రము సామాన్యధర్మముగా నున్నది. అట్లెవ్వరైనను నిర్బంధింపబడినచో హైకోర్టువారిదగ్గర

ఎవ్వరైనను హేబియస్ కార్పస్ అనబడు ఆజ్ఞను పొందవచ్చును. అట్టి ఆజ్ఞ నివ్వగనే చెఱసాలాధికారిగాని నిర్బంధకుడుగాని నిర్బంధితుని కోర్టుకు హాజరుపరుపవలెను. అంతట హైకోర్టువారు విచారించి, నిర్బంధమునకు సరియైన కారణము లేనిచో వెంటనే విడిచిపుచ్చెదరు. తగు కారణముండి సామాన్యనేర మారోపింపబడియున్నచో జామీనుపుచ్చుకొని విడచెదరు. పెద్దనేర మారోపింపబడియున్నచో న్యాయసభవారు పరివేష్టించు ప్రథమసమావేశముననే విచారించునట్లును, అట్లు విచారించనిచో జామీనుపై విడుదలచేయునట్లును, రెండవ సమావేశమందు కూడ విచారణచేయనిచో అసలే విడుదల చేయునట్లును తీర్పుజేయుదురు. ఈ ఆజ్ఞాప్రకారము జరుపబడనిచో హైకోర్టువారికి మఱల మనవిచేయుటకు ముద్దాయికి హక్కుకలదు. అక్రమనిర్బంధము చేసినవానిపైనను చేయించినవానిపైనను క్రిమినలు చర్యయు సివిలుఅభియోగమును జరిగించవచ్చును. ఇట్లు వ్యక్తిస్వాతంత్ర్యము కాపాడబడుచున్నది.

వాగ్రచనా ముద్రణ ప్రకటనముల స్వాతంత్ర్యమును సమావేశస్వాతంత్ర్యమును కూడ సామాన్యధర్మమును బట్టి ప్రజల కేర్పడియున్నవి. అనగా ఇతరులకు హాని కలిగించునట్టిమాటలు, రచనలు, ప్రకటనలు, చర్యలు, చేసినవారితరులవలన సివిలుక్రిమినలుచర్యలకు బాధ్యులగుదురను సామాన్యసిద్ధాంతమును బట్టి, అట్టిబాధ్యత తప్ప ఇందును గూర్చి ప్రత్యేకముగా వేఱే నిరోధకశాసనము లెవ్వియు

చేయబడలేదు. ముద్రాయి తనతో సమానస్థితిగతులు గల పండ్రెండుగురు సజాతీయగృహస్థులు హర్షించి మన్నింపగల కార్యములెల్ల చేయవచ్చును; సంగతులు పలుకవచ్చును, వ్రాయవచ్చును, ముద్రించి ప్రకటింపవచ్చును. ఇందువలన వ్యక్తిదూషణమున కెట్టి చిక్కులు గలవో అట్టి చిక్కులే ప్రభుత్వదూషణమునకును నుండునుగాని అంతకన్న నివి అధికభయావహములు నధికతరగర్హ్యములు నగు దోషములు కాజాలవు.

తమ యభిప్రాయములే జనసామాన్యము కలిగి యున్నారనియు, వారు హర్షింపగలరనియు, ధైర్యమున్నచో ప్రభుత్వమునుగూర్చి నిర్భయముగా నెంత తీవ్రవిమర్శనలైనను చేయవచ్చును; ప్రకటింపవచ్చును. ఇందువలన నిజముగా ప్రభుత్వచర్యలు ప్రజలకు రుచింపనికాలమున నెంత రాజద్రోహపుమాటల నాడినను గూడ జూరీసభవారు దోషనిర్ణయము చేయరు. ఇంగ్లీషుధర్మమునుబట్టి శాస్త్రవిరుద్ధములను, న్యాయనిబంధనల నుల్లంఘించునట్టియు, చర్యలను గూర్చి న్యాయస్థానములందు కేసులు పెట్టి విచారింపవలెనేగాని, ఎన్నడో ఏదో నిబంధన నుల్లంఘింపగలడని ఒక వ్యక్తియొక్క వాగ్రచనా ముద్రణ ప్రకటన వ్యక్తిస్వాతంత్ర్యములను నిరోధింపరాదు. అందువలన నాదేశమున ముద్రణాలయములకు పత్రికలకు లైసెన్సులు, నిరోధములు, అధికారులతనిఖీ, 'సెన్సారుషిప్పు' మున్నగు నాటంకములు లేవు. ప్రకటనలను నిషేధించుట, పుస్తకములను పట్టుకొనిపోవుట ఆచారములేదు.

ఇంగ్లాండులో వ్యక్తిస్వాతంత్ర్యమునుబట్టి ఒకవ్యక్తి యితరులహక్కులకు భంగము లేకుండగను, ఇతరుల ఆస్తిపైన అక్రమప్రవేశము చేయకుండగను, తన యిచ్ఛవచ్చినచోటికి పోవుటకు, ఉండుటకు, అభిప్రాయములు ప్రకటించుటకు, నెట్లు హక్కు కలిగి యున్నాడో అట్లే పలువురు వ్యక్తులు వ్యష్టిగను సమష్టిగను కూడా అట్టి హక్కులు కలిగియున్నారు. ఇందువలన స్వేచ్ఛగా నిర్నిరోధముగా బహిరంగముగా సమావేశమై సభలు చేసికొనుహక్కులు స్థిరపడియున్నవి. ఏదో యొక న్యాయనిబంధన నుల్లంఘించినగాని ఒక వ్యక్తి యెట్లు సివిలుక్రిమినలుచర్యలకు పాత్రుడు కాడో అట్లే ప్రజలసమావేశములు నందుకు పాత్రములు కావు. అక్రమపుబనులు చేయుటగాని, దౌర్జన్యపుపద్ధతులతో నేరము లొనరించుటగాని, శాంతికి భంగము కలిగించుటగాని, ఉద్దేశముగా కలిగి అట్టి యకృత్యమేదో యొకటి జరిగిననే అది అశాస్త్రీయమగును గాని, ఎన్నడో జరుగునను నూహతో దాని నెవ్వరును నశాస్త్రీయ మనుటకు వీలులేదు; నిషేధించుటకును వీలులేదు. సమావేశస్వాతంత్ర్యమును ప్రజలు దుర్వినియోగము చేసి అశాస్త్రీయపుబనులు జరిగించినచో నా సమావేశములోని ఆ యా వ్యక్తులు, నిరోధమునకు, అభియోగమునకు, శిక్షలకు, పాత్రు లగుదురు. అక్రమపుబనులు జరుగుచున్నప్పుడే అధికారులు వానిని నివారించుటకు తగువిధములుగా ప్రయత్నించి, ఇక నిర్బంధప్రయోగము, బలప్రయోగము, చేయకుండగా దానిని నాపుటకు వీలులేదని స్పష్టపడినప్పుడే, అవసర

మైనంత మాత్రపు నిర్బంధము, బలము, నుపయోగించి వానిని నివారింపవలెను. వ్యక్తులవిషయమునను సభను చెదరగొట్టుటలోను కూడ ఇదేపద్ధతి అట్లు చేయుటకు ముందు మేజస్ట్రేటు, పోలీసువారు, సభను హెచ్చరింపవలెను. ఈ చర్యయందే మాత్రము మీరినను పోలీసుఅధికారులు సివిలుక్రిమినలుచర్యలకు బాధ్యులగుదురు. ప్రతిఅభియోగమునందును పోలీసువారిచర్యలయొక్క ధర్మాధర్మములను గూర్చియే న్యాయస్థానమువారు యోచింతురుగాని ముద్దాయిప్రవర్తనయొక్క ధర్మాధర్మములను గూర్చికాదు. పార్లమెంటువారేదైన ప్రత్యేకశాసనముచేసిన తప్ప దేశములోని సామాన్యధర్మమున బహిరంగసభ లేక సమావేశము, ఏ రాజ్యాంగమంత్రియొక్క ఆజ్ఞనలసగాని, ఏ ప్రభుత్వాధికారి లేక ఏమేజిస్ట్రేటుయొక్క ఉత్తరువునుబట్టిగాని అశాస్త్రీయము కాజాలదు. దాని నెవ్వరు నిషేధింప వీలులేదు. అందువలన ప్రభుత్వచర్యలను లిఖితవాగ్రూపముగాను, లేక సభలయందును, ప్రజలు నిర్భయముగా ఖండింపగలుగుచున్నారు.

ప్రజలు తమకష్టనిష్ఠురములను తెలుపుకొనుటకు ప్రభుత్వమునకు ఫిర్యాదుచేసికొనుటకు 'బిల్ ఆఫ్ రైట్సు' అనబడు స్వాతంత్ర్యప్రకటనశాసనమువలన స్థిరపడినది. వాగ్రచనా ముద్రణ ప్రకటన సమావేశస్వాతంత్ర్యములిందుకు తోడ్పడుచున్నవి.

పూర్వమువలె ప్రభుత్వము శాశ్వతముగా నొక ప్రతిష్ఠిత సైన్యమును చేతిక్రింద నుంచుకొని ప్రజల నణచుటకు నేడు వీలులేదు. సైనికవ్యవస్థ ఎప్పటికప్పుడు పార్లమెంటువారే మంజూరుచేయవలసియున్నది.

ఇట్లు సార్వజనికములగు హక్కు లింగ్లాండులో సామాన్యధర్మసూత్రములుగా స్థిరపడియున్నవి. ఇందులకు విరుద్ధముగా ప్రభుత్వమువారు జరిగించవలెనన్నచో నందుకొరకు ప్రత్యేకశాసనములు చేయవలసియుండును. ఉదాహరణమునకు యుద్ధములు, అశాంతి ప్రబలియున్నప్పుడు దేశములోని ఆందోళనపరులను, ప్రభుత్వవిరోధులను నిర్బంధింపవలెనన్నచో హేబియస్ కార్పస్ హక్కు తాత్కాలికముగా రద్దుచేయుశాసనమును ముందుగా చేయవలెను. ఇట్టి నిరోధక శాసనములు పార్లమెంటులో ప్రవేశపెట్టినప్పుడవి ప్రజాప్రతినిధుల విమర్శకు గుఱియై మార్పుజెందును. ఇట్టి ఆపద్ధర్మమున గావింపడిన శాసనములను పురస్కరించుకొని చేయబడిన చర్యలకు ప్రభుత్వోద్యోగులు సివిలు క్రిమినలు చర్యలకు, బాధ్యులు గాకుండగా కొన్నాళ్ళకొక 'ఇండెమ్నిటీ' చట్టము అనగా క్షమాపణచట్టము కూడా ప్రవేశపెట్టబడును. అప్పుడును ప్రభుత్వచర్యలు విమర్శింపబడును.

విజ్ఞానచంద్రికాగ్రంథమాల ౪౦.

# అధినివేశ స్వరాజ్యము.

# (DOMINION STATUS)

దిగవల్లి వేంకటశివరావు,

చెరుకుపల్లి వేంకటప్పయ్య.

బెజవాడ : ఆంధ్రగ్రంథాలయ ముద్రాక్షరశాలయందు

క. కోదండరామయ్యగారిచే ముద్రింపబడినది.

౧౯౨౩

అన్నిహక్కులు గ్రంథకర్తలవి.

# అధినివేశ స్వరాజ్యము.

## విషయానుక్రమణిక.


అధ్యాయము — పుటలు

౧. అధినివేశ స్వరాజ్యము. — ౧-౧౩.

'డొమినియన్ స్టేటస్' అనగా నేమి? అధినివేశ స్వరాజ్య స్వరూప స్వభావముల నిర్వచనము. బ్రిటిషుసామ్రాజ్యమున ఇంగ్లాండుతో పాటు సరిసమాన గౌరవముగల స్వతంత్ర ప్రజాప్రభుత్వ రాజ్యము లగు కెనడా మొదలగు అధినివేశముల రాజ్యాంగముల యొక్క ప్రధానలక్షణము లేమి? ప్రజాప్రభుత్వాధికారములు; పార్లమెంటుప్రభుత్వము, ధర్మపరిపాలనము, అధినివేశ స్వరాజ్య 'ప్రభుత' (Sovereignty). "వెస్టు మినిస్టర్" రాజ్యాంగ చట్టము (౧౯౩౧) - పరిపూర్ణప్రభుత.

౨. బ్రిటిషుసామ్రాజ్య స్వరూపస్వభావములు. — ౧౪—౫౦

సామ్రాజ్యములోని రాజ్యములలో కొన్నిటపట్ల నిరంకుశపద్ధతి, మరికొన్నిటపట్ల కూడా భాగస్వామ్య పద్ధతి, రాజకీయ ఆర్థికవిషయములందు ఇంగ్లాండు, అధినివేశములు, సమానభాగస్వాములుగ నుండుట సామ్రాజ్యమువలన ఇంగ్లాండు, అధినివేశములు పొందుచున్న పరస్పర లాభములు. నౌకాబలము - పెట్టుబడి - ఉద్యోగములు - వలస - వివిధలాభములు, మారకము రేటు లోనిరహస్యము. సామ్రాజ్యవాణిజ్యముకొరకు చేయబడు కట్టుదిట్టములు: వర్తకబోర్డు, దేశాంతర వర్తకశాఖ; పారిశ్రామిక ప్రదర్శనసంతలు, వాణిజ్యపరపతి, సామ్రాజ్య లాభవిధానము, సామ్రాజ్య ఆర్థికసంఘము, నానారాజ్యసమితి; అనుద్యోగ వాణిజ్యప్రోత్సాహక సంస్థలు; బ్రిటిషు పరిశ్రమల ఫెడరేషను.

అధ్యాయము — పుటలు.


౩. స్వరాజ్య ప్రయోజనము. ౫౧—౯౩.

రాజకీయ స్వాతంత్ర్యము ప్రజాప్రభుత్వమువలని లాభములు, ప్రభుత్వ వ్యయనిర్ణయము, పన్నుల పద్ధతి, వేతనముల పద్ధతి, ఋణపద్ధతి. అర్థోత్పత్తి - అర్థసంపద - వాణిజ్యవ్యవసాయ పరిశ్రమల యభివృద్ధి; కృషిసంపద పశుసంపద, రైలుదారి, ఎగుమతి దిగుమతి వ్యాపారము, ఆర్థికాభివృద్ధికొరకు ప్రభుత్వము చేయు సహాయము, ఆర్థిక క్షేమము - కార్మికులు, కార్మికుల జీవనవిధానము, ఆర్థిక విధాన-సమాన సౌఖ్యవిధానము; విద్యాభివృద్ధి - విద్యాపద్ధతులు, సాంఘికశ్రేయము- ఆరోగ్యము, దారిద్ర్యనివారణము, సంఘసంస్కారము.

౪. అధినివేశ స్వరాజ్యచరిత్ర. ౬౯—౧౨౪.

అధినివేశరాజ్యోత్పత్తి, వలసరాజ్యముల పరిపాలన; కెనడా రాజ్యాంగ సంస్కారము. కెనడాకు బాధ్యతాయుత స్వపరిపాలనము. వలస రాజ్యములు అధినివేశము లగుట, శాసననిర్మాణాధికారములు వృద్ధియగుట, వలసదేశముల రక్షణ, ఆదిమనివాసులపైన అధికారము, వలసవ్యవహారములు వారి వశము లగుట సామ్రాజ్య వ్యవహారములందును విదేశవ్యవహారములందును ఇంగ్లాండుతో పాలుగొనుట. ౧౯౨౬ సామ్రాజ్య సభ - బాల్ఫరు కమిటీ - అధినివేశ స్వరాజ్య సార్వభౌమప్రపత్తి.

౫. అధినివేశ స్వరాజ్యసమస్య. ౧౨౫—౧౩౯.

ఈ సమస్యవలన నేర్చుకొనదగిన పాఠములు: భారతదేశమునకు స్వరాజ్యమొసగుటకు ఆటంకములుగ నున్నట్లు చెప్పబడు సంగతులు, ఇంగ్లాండులో ప్రజాప్రభుత్వము పరిపక్వము జెందినట్లు చెప్ప ౧౯ శతాబ్ది యారంభమున నాదేశప్రజల స్థితిగతులు, అమెరికా దేశము స్వతంత్రమగు నాటి పరిస్థితులు; కెనడాకు స్వరాజ్య

అధ్యాయము పుటలు.

మొసగునప్పటికీ దేశముయొక్క స్థితిగతులు. కెనడావారు తమ రాజ్యవ్యవహారములు నేటికిని లోపములు లేకుండ నిర్వహించుచున్నారా? ఆస్ట్రేలియా దక్షిణాఫ్రికాలకు స్వపరిపాలన మొసగు నాటికి స్వరాజ్యార్హత యుండెనా? భారతదేశమున సంస్థానముల క్రింద మూడవవంతు దేశముండుటయొక్క అర్థమేమి? రాజ్యాంగమున మినహాయింపులు రక్షణలు ప్రజాప్రభుత్వాధికారములను తగ్గించుటకా, వానిని కాపాడుటకా? సైన్యమునను విదేశవ్యవహారములకు మినహాయింపులు కావలెనా? అల్పసంఖ్యాకసమస్య ఒక్క భారతదేశములోనే కలదా? కాలప్రవాహము నాపగలరా?

౬. ఫెడరలు రాజ్యాంగవిధానము. ౧౪౦ - ౧౫౩.

ఫెడరలువిధాన మననేమి? ఫెడరలు రాజ్యాంగలక్షణములు, అధికారవిభజనము; కేంద్ర రాష్ట్రీయ ప్రభుత్వములు, విశిష్టాధికారములు, ఇతర రాజ్యాంగధర్మములు. అమెరికా సంయుక్తరాష్ట్రములలోను, స్విజర్లాండు కాన్ఫెడరేషను, కెనడా డొమినియను, ఆస్ట్రేలియా కామన్వెల్తుల ప్రభుత్వములందు నిర్మాణము లెట్లున్నవి? ఫెడరలు విధానమందలి మంచి చెడుగులు. దీనివలని లాభనష్టములు.

౭. ప్రజాప్రభుత్వము-సముప్రమాణప్రాతినిధ్యము. ౧౫౪-౧౫౮.

ఎన్నికపద్ధతియొక్క ప్రాముఖ్యత, సామాన్యమగు ఎన్నికపద్ధతి; 'ప్రపోర్షనల్ రిప్రజెంటేషన్' అనబడు ఎన్నికపద్ధతి.

౮. కెనడా డొమినియను. ౧౫౯ - ౧౬౭.

కెనడా రాజ్యాంగస్వరూపము శాసననిర్మాణాధికారము, సెనేటు; కామన్సుసభ; న్యాయపరిపాలనము, సుప్రీముకోర్టు; కేంద్ర రాష్ట్రీయ ప్రభుత్వముల అధికారములు.

౯ ఆస్ట్రేలియా కామన్వెల్తు. ౧౬౮-౧౭౭.

పూర్వచరిత్ర, రాజ్యాంగ స్వరూపము. శాసననిర్మాణము, కార్యనిర్వహణము; ధర్మపరిపాలనము; కేంద్ర రాష్ట్రీయ ప్రభుత్వాధికారములు.

౧౦ ఐరిషుఫ్రీస్టేటు. ౧౭౮-౧౯౩.

స్వరాజ్యోద్యమ చరిత్ర, ౧౯౨౨ రాజ్యాంగచట్టము: శాసననిర్మాణము; డెయిల్ ఇరెయిన్‌సభ, సెనేటుసభ, పరమోన్నత న్యాయస్థానము, ప్రజల స్వాతంత్ర్య స్వత్వములు

౧౧ ఆంగ్లరాజ్యాంగము. ౧౯౪-౨౨౩

బ్రిటీషుదీవుల పరిపాలనా విధానము, స్వరూపమున రాజరికము, స్వభావమున ప్రజాప్రభుత్వము. బ్రిటీషుదీవులరాజా - ఆయన అధికారములు, పార్లమెంటు, ప్రభువులసభ, కామన్సుసభ, రాజకీయపక్షములు, ఎన్నికపద్ధతులు - ప్రజాప్రభుత్వము; "కాబినెట్టు" మంత్రిమండలి, పార్లమెంటు - సామ్రాజ్య పరిపాలనము ప్రీవీకవున్సిలుసభ - ధర్మపరిపాలనావిధానము, బ్రిటీషుప్రజల స్వాతంత్ర్యములు, ప్రజలకుగల హక్కులు రాజ్యాంగధర్మమువలన, ఆచారమువలన, ధర్మపరిపాలనాపద్ధతివలన, స్థిరీభూతములగుట, వ్యక్తి స్వాతంత్ర్యము. "హేబియస్ కార్పసు" హక్కు, వాగ్రచనముద్రణ ప్రకటన స్వాతంత్ర్యము, సమావేశ స్వాతంత్ర్యము.

అనుబంధములు. (I-IX) ౨౨౪-౨౩౩

వివిధదేశముల ప్రభుత్వవ్యయపట్టికలు.


---

## వివిధ దేశస్థితిగతుల అంకెల పట్టికల సూచిక.


పట్టిక. పుట.

(౧) ౧౯౧౩-౧౯౨౫ సం॥రం ప్రపంచ పారిశ్రామిక ఎగుమతులలో వివిధదేశముల ఎగుమతులు నూటికెన్నివంతులు? ౧౭

(౨) ౧౯౨౮-౨౯లో వివిధదేశముల వాణిజ్యనెకలు. ౧౮

(౩) ౧౯౨౪-౨౬ సామ్రాజ్యవర్తకము, మొత్తము వర్తకములో నూటికెన్నివంతులు. ౨౪

(౪) ౧౯౨౭ లో బ్రిటీషువారి ఎగుమతి, దిగుమతి వ్యాపారమునందు మోటుబరికాతాదేశములు. ౨౫

(౫) బ్రిటీషువారి పెట్టుబడ్లు. ౨౬-౨౭

పట్టిక: పుట.

(౬) భరతఖండమునందలి ఉద్యోగములందు ఆంగ్లేయులు; భారతీయులు. ౨౮

(౭) భరతఖండమునుండి బ్రిటీషువారికి పోవు వేతనములు, బత్తెములు ౨౯

(౮) బ్రిటీషుదీవులనుండి వలసపోవువారు. ౩౦

(౯) భరతఖండమునుండి బ్రిటీషువారికి ఏటేట పోవు ధనము. ౩౨

(౧౦) ఇంగ్లాండు ప్రభుత్వము నాటి స్వరాజ్య తీర్మాన సామ్రాజ్యము ౪౨

(౧౧) లోకమునందలి మనుష్యుని సరాసరి ఆదాయము. ౫౫

(౧౨) ౧౯౨౭-౨౮ లో వివిధ ప్రభుత్వముల సామ్రాజ్యములో సైనిక వ్యయము నాగరిక విద్య మొదలగునవి ౫౬

(౧౩) వివిధదేశముల సైన్యముల పట్టిక. ౫౭

(౧౪) వివిధదేశముల కృషిసంపద, భూసారముల నిర్ణయము / ధాన్యాది పంటలు ఎకరమునకెన్ని పౌనులు. ౬౪

(౧౫) వేయిమంది జనసంఖ్యకు వ్యవసాయమునకు ఉపయోగపడు సౌకర్యము. ౬౫

(౧౬) ౧౯౨౦ లో ౧౦౦ మంది జనసంఖ్యకు ఎన్ని పశువులు? ౬౫
౧౯౨౭ లో ౧౧౦ మంది జనసంఖ్యకు ఎన్ని గోవులు? ౭౫

(౧౭) ౧౯౨౪ నాటికి పాడిపశువుల సంఖ్య ౬౬

(౧౮) దేశములలో సాలుకు జరుగు మొత్తము పాల ఉత్పత్తి, తల ౧ కి ఎన్ని పౌనులు? ౭౬

(౧౯) ౧౯౧౧-౧౩, ౧౯౨౪-౨౬ లో వివిధదేశములందు ప్రతి మనిషికి జరిగిన ఎగుమతి దిగుమతి వర్తకములు. ౬౭

(౨౦) ఆధునిక దేశములందు ... ౭౪

(౨౧) ౧౯౨౯-౩౦ ప్రజల ఆరోగ్యము, ... జనన మరణములు, శిశుమరణములు. ౯౦

(౨౨) గ్రామాల ఆదాయము ౯౦

(౨౩) వివిధదేశముల జనసంఖ్య, విస్తీర్ణము, (౧౦ దేశముల వైశాల్యము ౧ చ॥ మైలుకు జనసంఖ్య బండి, మొత్తము దారిపొడవు, ప్రభుత్వాదాయము, జాతీయ ఋణము), బ్రిటీషుదీవుల జనసంఖ్య. ౯౪-౯౫

పట్టిక | పుటలు
--- | ---
(౨౪) మద్రాసు రాష్ట్రము, తాలూకా, గ్రామ, జిల్లాల జనసంఖ్య, ఆదాయము. | ౯౫
(౨౫) అధినివేశములందలి జనమువాసులు: [illegible] టూల; నెల్లయిండియనలు, మెయోరీలు | ౧౧౧
(౨౬) అధినివేశములందలి ఆసియావాసులు, భారతీయులు. | ౧౧౨
(౨౭) కెనడా సమస్థానముకు రాష్ట్రములంపు సభ్యుల సంఖ్య | ౧౬౦
(౨౮) ఐరిష్ ఫ్రీస్టేటు వ్యయవిధానము, ౧౯౨౩-౧౯౨౯ ఖర్చుల తప్పులు; ప్రజారక్షణకు నూటికెన్ని వంతులు? | ౨౨౪
(౨౯) భారత దేశ జాతీయ ప్రభుత్వ వ్యయము (౧౯౨౧-౧౯౩౦) ఖర్చుల పట్టీ, (ప్రభుత్వ లెంచనా) | ౨౨౫
(౩౦) ౧౯౨౬-౨౮ [illegible] వ్యయవిధానము; ఆయా ఖర్చులు తలకెంత? | ౨౨౬
(౩౧) ౧౯౨౯-౩౦ ఆస్ట్రేలియా కామన్వెల్తు కేంద్ర రాష్ట్రీయ వ్యయము, ఆయా ఖర్చులు తలకెంత? | ౨౨౭
(౩౨) ౧౯౨౮-౨౯ లో భారతదేశమున విద్య, ఆరోగ్యము, వైద్యము, పరిశ్రమలు, వ్యవసాయమునకు చేయబడిన వ్యయము తలకెంత? | ౨౨౮
(౩౩) ౧౯౨౯-౩౦ లో మద్రాసు, బొంబాయి, వంగ రాష్ట్రములలో విద్య, వైద్యము, పోలీసులకు తలకు చేసిన వ్యయము. | ౨౨౯
(౩౪) ౧౯౨౫-౨౬ అమెరికా సంయుక్త రాష్ట్రముల వ్యయవిధానము. ఆయావ్యయములు మొత్తము వ్యయములో నూటికెన్ని పాళ్ళు? | ౨౩౦
(౩౫) ౧౯౨౫-౨౬, ౧౯౨౭-౨౮ లో భారతదేశ కేంద్ర రాష్ట్రీయ ప్రభుత్వముల వ్యయవిధానము మొత్తము వ్యయములో ఆయావ్యయములు నూటికెన్ని వంతులు? | ౨౩౧-౨౩౨
(౩౬) భారతదేశ సంస్థానముల స్థితిగతులు - బ్రిటిషు రాజ్యము. విస్తీర్ణము జనసంఖ్య, [illegible]దారి, ప్రభుత్వాదాయము, చదువగలవారి సంఖ్య, పాఠశాలల సంఖ్య, సహకారసంఘముల సంఖ్య. | ౨౩౩

వెల : చందాదారులకు మేలుప్రతి } ౦—౬—౦
ఇతరులకు సాదాప్రతి }

ఇతరులకు మేలుప్రతి ౦—౧౨—౦

వలయువారు:—

దిగవల్లి వేంకటశివరావు,

బెజవాడ.

అని వ్రాయవలయును.